క్లుప్తంగా

చలివేంద్రం ప్రారంభం



బాలానగర్: బాలానగర్ రెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని బుధవారం కార్పొరేటర్ ఆవుల రవీందర్‌రెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు ఉపేందర్‌రెడ్డి, జనరల్ సెక్రటరీ వెంకట్‌రెడ్డి, ట్రెజరర్ సీహెచ్.వెంకట్ రెడ్డి, మదర్ డైరీ డైరెక్టర్ దొంతిరి సోమిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హైదర్‌నగర్‌కు చేరుకున్న గడపగడపకు బీజేపీ

భాగ్యనగర్‌కాలనీ: గడపగడపకు బీజేపీ పాదయాత్ర బుధవారం హైదర్‌నగర్ డివిజన్‌కు చేరుకుంది. ఈ సందర్భంగా రవికుమార్‌యాదవ్ మాట్లాడుతూ... అధికారపక్ష నాయకులు ప్రజల బాధలను పట్టించుకోవటం లేదని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం ఎన్నో పథకాలు ప్రవేశపెట్టినా అవి రాష్ట్ర ప్రజలకు అందుబాటులోకి రాకుండా చేస్తున్నారని ఆరోపించారు. ఆయుష్మాన్ భారత్, సుకన్య సమృద్ధి యోజన, పీఎం కిసాన్ వంటి ఎన్నో పథకాలు ప్రజలకు చేరటం లేదన్నారు. బీజేపీ నాయకులు నిత్యం ప్రజల్లో ఉండి సమస్యలను గుర్తించి ఎప్పటికప్పుడు అధికారుల దృష్టికి తీసుకెళ్తేనే పరిష్కరిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు రామరాజు, కుమార్‌యాదవ్, మణిభూషణ్, రవీందర్‌రావు, కమలాకర్‌రెడ్డి, నర్సింగ్ యాదవ్, రవీందర్‌రెడ్డి, కేశవులు, గోపాల్‌రావు తదితరులు పాల్గొన్నారు.

సైన్స్ ఎక్స్‌పో



కూకట్‌పల్లి: కూకట్‌పల్లిలోని సిద్ధార్థ డిగ్రీ, పీజీ కళాశాలల విద్యార్థులు సంయుక్తంగా నిర్వహించిన కామర్స్, సైన్స్ ఎక్స్‌పో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వివిధ కళాశాలల విద్యార్థులు తమ ప్రాజెక్టులను ప్రదర్శించారు. ఈ కార్యక్రమాన్ని కళాశాల చైర్మన్ జి. భాస్కర రావు, కళాశాల డైరెక్టర్లు మధుసూదన్‌రావు, అరవింద్‌రావు ప్రారంభించారు.

రోబో సహకారంతో మోకాలి మార్పిడి శస్త్ర చికిత్స

గచ్చిబౌలి: రోబో సహకారంతో మోకాలి మార్పిడి శస్త్ర చికిత్స గచ్చిబౌలి కేర్ ఆస్పత్రిలో విజయవంతంగా నిర్వహించారు. మోకాలి మార్పిడి శస్త్ర చికిత్సకు అధునాతన సాంకేతికత వెలిస్ రోబో అందుబాటులో ఉందని కేర్ ఆస్పత్రి ఆర్థోపెడిక్ హెచ్‌ఓడీ, జాయింట్ రీప్లేస్‌మెంట్ సర్జన్ డాక్టర్ రత్నాకర్ తెలిపారు. రోబో సాయంతో ఖచ్చితమైన కొలతలతో మోకాలి ఎముకలను చెక్కడం, అంత్యంత ఖచ్చితమై ఇంప్లాంట్స్ అమర్చడం వల్ల త్వరగా కోలుకోవచ్చన్నారు. 20 సంవత్సరాలుగా మోకాలి మార్పిడి చికిత్సలో జరిగే ఇబ్బందులను అధిగమించవచ్చని డాక్టర్ రత్నాకర్‌రావు తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

బాలానగర్: బ్రెయిన్ ట్యూమర్ వ్యాధితో బాధపడుతున్న వ్యక్తి తన ఇంట్లో బోర్లా పడి అనుమానాస్పదస్థితిలో చనిపోయిన సంఘటన బాలానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో బుధవారం చోటు చేసుకుంది. సీఐ భాస్కర్ తెలిపిన వివరాల ప్రకారం.. షేక్ ఖాజా(44) భార్యాభర్తల మధ్య గొడవలు వచ్చి విడిపోయి ఒంటరిగా నివసిస్తున్నాడు. అతను గత 2018 సంవత్సరం నుంచి బ్రెయిన్ ట్యూమర్ వ్యాధితో బాధపడుతున్నారు. వినాయకనగర్‌లో అద్దె ఇంట్లో నివసిస్తున్న షేక్ ఖాజా ఇంటి తలుపు సాయంత్రం వరకు తెరవకపోవడంతో అనుమానం వచ్చిన పొరుగింటి నివాసి సయ్యద్ అహ్మద్ లోపటికి తొంగి చూడగా దుర్వాసన వచ్చింది. వెంటనే అతడి సోదరుడు షేక్ బాజీకి ఈ విషయాన్ని తెలియజేశాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఇంట్లోకి వెళ్లి చూడగా షేక్ ఖాజా బోర్లా పడి చనిపోయి ఉన్నాడు. తన తమ్ముడు బ్రెయిన్ ట్యూమర్ వ్యాధితోనే చనిపోయి ఉంటాడని అతడి అన్న పోలీసులకు తెలిపాడు. మృతదేహాన్ని గాంధీ ఆసుపత్రికి తరలించినట్లుగా పోలీసులు తెలిపారు.

క్రీడాకారుల సందడి

రాయదుర్గం: గోపన్‌పల్లి జవహర్ నవోదయ విద్యాలయంలో దివ్యాంగ క్రీడాకారుల సందడి నెలకొంది. బుధవారం జవహర్ నవోదయ విద్యాలయ రంగారెడ్డిజిల్లా, ఆదిత్య మెహతా ఫౌండేషన్ స్పోర్ట్స్ కోచింగ్ సెంటర్ ఆధ్వర్యంలో పారా స్పోర్ట్స్ క్రీడాకారుల ఎంపిక కొనసాగింది. నవోదయ విద్యాలయ సమితి డిప్యూటీ కమిషనర్ గోపాలకృష్ణ, జేఎన్‌వి రంగారెడ్డిజిల్లా ప్రిన్సిపల్ డానియల్ రత్నకుమార్ పర్యవేక్షించారు.

స్థానిక సమస్యలపై ఆరా

- పబ్లిక్ కాంటాక్ట్‌లో కార్పొరేటర్లు, అధికారులు
- ప్రాధాన్యతా క్రమంలో పరిష్కరిస్తామని హామీ



బృందావన్ కాలనీలో స్థానికులతో చర్చిస్తున్న కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ్

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి జంట సర్కిళ్ల పరిధిలోని పలు డివిజన్లలో సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పబ్లిక్ కాంటాక్ట్ కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఆల్విన్‌కాలనీ, వివేకానందనగర్, బాలాజీనగర్, హైదర్‌నగర్, ఓల్డ్ బోయిన్‌పల్లి డివిజన్లలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్థానికులు పలు సమస్యలపై వారికి వినతి పత్రాలను అందజేశారు. అనంతరం కార్పొరేటర్లు మాట్లాడుతూ... కాలనీల్లో ఉన్న సమస్యలను నేరుగా అధికారులకు వివరించి వెంటనే సమస్యలను పరిష్కరించుకోవచ్చన్నారు.

- హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని సెవెన్ హిల్స్, హెచ్ఎంటీహిల్స్ కాలనీ, తులసీనగర్‌లలోని కాలనీల సమస్యలను స్థానికుల నుంచి కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు, అధికారులు అందుకున్నారు.
- బాలాజీనగర్ డివిజన్ పరిధిలోని కైత్లాపూర్, శ్రీరామ్‌నగర్ కాలనీలోని సమస్యలను స్థానిక కార్పొరేటర్ పగుడాల శిరీష బాబూరావు, అధికారులు తెలుసుకున్నారు.
- అదే విధంగా ఆల్విన్‌కాలనీ డివిజన్, ఎల్లమ్మ బండ పరిధిలోని గణేష్‌నగర్, తారకరామ్ నగర్, రాజీవ్ గాంధీ నగర్, మొగులమ్మ కాలనీ, ఖాజా నగర్ కాలనీల్లో సమస్యలను స్థానిక కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్, అధికారులకు వివరించారు.
- వివేకానందనగర్ డివిజన్ పరిధిలోని మాధవరం కాలనీ ఏ,బీ,సీ బ్లాకులు, కమలప్రసన్న నగర్, ఆల్విన్‌కాలనీ ఫేజ్–1 ప్రాంతాలోని సమస్యలను తెలిపే పత్రాన్ని స్థానికులు కార్పొరేటర్ రోజాదేవి రంగారావు, అధికారులకు అందజేశారు.
- ఓల్డ్‌బోయిన్‌పల్లి డివిజన్ పరిధిలోని యాదిరెడ్డి కాలనీ జరిగిన సమావేశంలో వివిధ విభాగాల అదికారులు, కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ్ పాల్గొన్నారు. సీసీ రోడ్లు నిర్మాణం చెపట్టాలని, డ్రైనేజీ సమస్యలను పరిష్కరించాలని కాలనీవాసులు కోరారు. అదే డివిజన్‌లోని వివిధ కాలనీల్లోని సమస్యలను తెలుసుకున్న కార్పొరేటర్, అధికారులు ప్రాధాన్యత క్రమంలో పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ సమస్యలను అధికారులు దశలవారీగా పరిష్కరిస్తారని కార్పొరేటర్లు తెలిపారు.



కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు, అధికారులకు వినతి పత్రం అందజేస్తున్న స్థానికులు



బాలాజీనగర్ డివిజన్‌లో పర్యటిస్తున్న కార్పొరేటర్ శిరీష బాబూరావు



ఆల్విన్‌కాలనీ డివిజన్‌లో వినతిపత్రం స్వీకరిస్తున్న కార్పొరేటర్ వెంకటేష్‌గౌడ్, అధికారులు

పరిశుభ్రతే లక్ష్యంగా పని చేస్తున్నాం

ఆల్విన్‌కాలనీ: పరిశుభ్రతే లక్ష్యంగా పని చేస్తున్నామని వివేకానందనగర్ డివిజన్ రామకృష్ణవీధి అసోసియేషన్ అధ్యక్షుడు జనంపల్లి పురేందర్‌రెడ్డి అన్నారు. ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ, కార్పొరేటర్ మాధవరం రోజాదేవి ఆదేశాల మేరకు బుధవారం కాలనీలో ఎంతోకాలంగా పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని తొలగించేలా చర్యలు తీసుకున్నారు. అదే విధంగా విద్యుత్ స్తంభాలు, వైర్లు పురాతనమైనవి కావటంతో తెగి పోయే ప్రమాదం ఉన్నందును వాటిని తీసివేసి నూతన వైర్లను ఏర్పాటు చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాబోయే రోజుల్లో కాలనీకి మరెన్నో ప్రభుత్వ పథకాలను తీసుకొచ్చేందుకు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో చెంగల్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, సూర్యనారాయణ, వెంకటేశ్వరరావు, శ్రీనివాస రావు, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.



రామకృష్ణవీధిలో పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని తొలగిస్తున్న సిబ్బంది

బాలానగర్ పీహెచ్‌సీలో నేటి నుంచి బూస్టర్ డోస్

బాలానగర్: కోవాగ్జిన్ లేదా కోవిషీల్డ్ రెండు డోసుల చొప్పున తీసుకున్న వారు «కార్బోవ్యాక్స్» టీకాను బూస్టర్ డోస్‌గా తీసుకోవాల్సి ఉంటుంది. గురువారం నుంచి బూస్టర్ డోసును బాలానగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఇవ్వనున్నట్లు వైద్యాధికారులు తెలిపారు.

కూకట్‌పల్లి కోర్టులో విధుల బహిష్కరణ



న్యాయవాది రవికాంత్‌రెడ్డిపై జరిగిన దాడికి నిరసనగా కూకట్‌పల్లి కోర్టులో ధర్నా చేస్తున్న న్యాయవాదులు

కూకట్‌పల్లి: రాజేంద్రనగర్ కోర్టులో సీనియర్ న్యాయవాది రవికాంత్‌రెడ్డిపై జరిగిన దాడికి నిరసనగా బుధవారం కూకట్‌పల్లి కోర్టులో న్యాయవాదులు విధులు బహిష్కరించి ధర్నా చేశారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గోవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ... న్యాయవాదులపై రోజు రోజుకు దాడులు పెరిగిపోతున్నాయని అన్నారు. న్యాయవాదుల రక్షణ చట్టం తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. న్యాయవాదులపై జరుగుతున్న దాడులను ప్రభుత్వం సీరియస్‌గా తీసుకొని దాడులను అరికట్టాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు మల్లేష్, జాయింట్ సెక్రటరీ హరిశంకర్‌రెడ్డి, ట్రెజరర్ డేవిడ్ రాజు, లైబ్రరీ సెక్రటరీ హర్షవర్ధన్‌రెడ్డి, స్పోర్ట్స్ సెక్రటరీ మధుసూదన్, మహిళా సెక్రటరీ జి.శ్రీలత, ఎగ్జిక్యూటివ్ మెంబర్లు శివకృష్ణ, చంద్రశేఖర్, శ్వేతా కుమారి, కె. గోపాల్‌రెడ్డి, శేఖర్‌గౌడ్, బాలవీర్ తదితరులు పాల్గొన్నారు.

‘మనూ’కు గోల్డ్ గార్డెన్ అవార్డు

రాయదుర్గం: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల నిర్వహించిన 7వ గార్డెన్ ఫెస్టివల్, అర్బన్ ఫార్మింగ్ ఫెస్టివల్‌లో పచ్చదనానికి ఆలవాలంగా నిలిచిన ఉర్దూ విశ్వవిద్యాలయంకు గోల్డ్ గార్డెన్ అవార్డు లభించింది. ఇటీవల పబ్లిక్ గార్డెన్‌లో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో ఉర్దూ విశ్వవిద్యాలయం ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎస్ నాగేశ్వరరెడ్డి గోల్డ్ గార్డెన్ అవార్డు, సర్టిఫికెట్‌ను మంత్రి ఎస్ నిరంజన్‌రెడ్డి చేతులమీదుగా అందుకున్నారు.

పచ్చదనం మరింత పెంచాలి : వీసీ ఐనుల్ హసన్

ఉర్దూ విశ్వవిద్యాలయంలో మరింత పచ్చదనం పెంచాలని వీసీ అధికారులకు సూచించారు. గోల్డ్ గార్డెన్ అవార్డు అందుకున్న ఈఈ నాగేశ్వర్‌రెడ్డి వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ సయ్యద్ ఐనుల్‌హసన్‌ను బుధవారం ఆయన కార్యాలయంలో కలిశారు. ఇంజనీర్ నాగేశ్వర్‌రెడ్డిను ఆయన అభినందించారు.

ఇఫ్తార్



మూసాపేట జనతానగర్‌లోని మసీదు వద్ద బుధవారం ఇఫ్తార్ విందు నిర్వహించారు. మజీద్–ఏ–రహమానియా ఆధ్వర్యంలో ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ కార్యక్రమంలో గౌసుద్దీన్, చున్ను పాషా, అబ్దుల్ రషీద్, నవాస్, సలీం, నహీమ్, సయ్యద్ గౌస్ తదితరులు పాల్గొన్నారు. – మూసాపేట

21 నుంచి ఆదిశంకరాచార్యుల జయంతి ఉత్సవాలు



ఉత్సవాల వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, కార్పొరేటర్

కేపీహెచ్‌బీకాలనీ: కేపీహెచ్‌బీ డివిజన్‌లో 6వ ఫేజులోని శ్రీవిజయదుర్గ రామలింగేశ్వర దేవాలయంలో ఈనెల 21 నుంచి 25వ తేదీ వరకు జరిగే శంకర జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నామని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... హిందూ ధర్మం పక్కదారి పట్టి ప్రజలు అస్తవ్యవస్త విధానాలు అవలంభిస్తున్న సమయంలో ఆదిశంకరాచార్యులు ధర్మాన్ని కాపాడారన్నారు. కేరళ రాష్ట్రం నుంచి కాలడి అనే గ్రామంలో అవతార పురుషుడిగా జన్మించి అతి చిన్న వయసులోనే భారతదేశాన్ని కాశ్మీరు నుంచి కన్యాకుమారి వరకు నాలుగు సార్లు పాదయాత్ర చేసి హిందూ ధర్మాన్ని కాపాడారని గుర్తు చేశారు. శక్తిపీఠాలను స్థాపించి ప్రజల్లో శాంతి సామరస్యం నెలకొల్పారని తెలిపారు. అటువంటి శంకరాచార్యులు కేవలం 32 సంవత్సరాలే జీవించి ధర్మాన్ని బతికించారని కొనియాడారు. అటువంటి గొప్ప వ్యక్తి జయంత్యోత్సవాలను అత్యంత ఘనంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ ఉత్సవాలకు విచ్చేసి ఆయన కృపాకటాక్షాలు పొందుతారని కోరుకుంటున్నానని తెలిపారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు కృష్ణారెడ్డి, సీనియర్ నాయకులు మందలపు సాయిబాబా, అడుసుమిల్లి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఖార్డ్ సోషల్ ఇంపాక్ట్ పాఠశాల భవనం ప్రారంభం



భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, జస్టిన్ వీలర్

కేపీహెచ్‌బీకాలనీ: కేపీహెచ్‌బీలోని గోపాల్‌నగర్‌లోని ఖార్డ్ సోషల్ ఇంపాక్ట్ ఆర్గనైజేషన్ పేద పిల్లల కోసం విద్యావకాశాలను కల్పించేందుకు దిశా ఖార్డ్ పాఠశాల శాశ్వత భవనాన్ని నిర్మించారు. బుధవారం ఈ పాఠశాల భవనాన్ని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, బర్కేడియా సీఈఓ జస్టిన్ వీలర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... ఖార్డ్ స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులు సుమన్ మల్లాది, మంజులతలను అభినందించారు. ఎంతోమంది నిరుపేదలకు వృత్తి శిక్షణలో తర్ఫీదు ఇచ్చి ప్రయోజకులను చేయడం గొప్ప విషయమన్నారు. నిరుపేద చిన్నారుల కోసం పాఠశాల భవనాన్ని నిర్మించి వారికి భోజనంతో పాటు ఉచిత విద్యను అందించటం గొప్ప విషయమన్నారు. అదే విధంగా పాఠశాల నిర్మాణానికి సహాయం చేసిన బర్కేడియా సంస్థ వారిని అభినందించారు. అత్యాధునిక సదుపాయాలతో ఈ డిజిటల్ యుగంలో పోటీతత్వాన్ని తట్టుకునేలా పిల్లల్ని తీర్చిదదిద్దడానికి సిద్ధంగా ఉన్న ఈ నిరుపేద పిల్లల పాఠశాల నిర్మాణం అత్యద్భుతమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో కేపీహెచ్‌బీ కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

విశ్వకర్మ వివాహవేదిక సమాచార కేంద్రం ప్రారంభం

కూకట్‌పల్లి: కూకట్‌పల్లిలోని శ్రీమద్విరాట్ వీరబ్రహ్మేంద్ర విశ్వకర్మ విశ్వేశ్వర దేవాలయంలో బుధవారం విశ్వకర్మ ఫౌండేషన్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో విశ్వకర్మ వివాహవేదిక ఉచిత సమాచార కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. తెలంగాణ సాహిత్య అకాడమీ చైర్మన్ జూలూరు గౌరీశంకర్ బుధవారం ఈ కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... బహుజనులకు ఇన్ని ప్రభుత్వ పథకాలు ప్రవేశపెట్టడం భారీ సామాజిక మార్పునకు నిదర్శనమన్నారు. ఈ మార్పులతో బహుజన వర్గాలలో రాబోయే దశాబ్ద కాలంలో ఊహించని మార్పులను చవిచూశామన్నారు. రేపు దేశంలో రావాల్సిన బహుజన చైతన్య మార్పులకు సంకేత చిహ్నంగా తెలంగాణ నిలుస్తుందన్నారు. పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి చూపిన మార్గంలో అన్ని కులాలను కలుపుకొని తెలంగాణ ముందుకు సాగుతుందని చెప్పారు. విశ్వకర్మ కులస్తులకు భవిష్యత్‌లో మరిన్ని మంచిరోజులు రానున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో విశ్వకర్మ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు అట్లూరి రవీంద్రాచారి, దేవాలయ కమిటీ చైర్మన్ పెద్దోజు నాగేశ్వరరావు, జనరల్ సెక్రటరి కె. పాండు తదితరులు పాల్గొన్నారు.

హ్యాకథాన్ విజేతలకు బహుమతుల ప్రదానం



బహుమతులు అందజేస్తున్న వీసీ కట్టా నర్సింహారెడ్డి తదితరులు

కేపీహెచ్‌బీకాలనీ: రోడ్డు భద్రత నిర్వహణ అంశంపై జేఎన్‌టీయూహెచ్ యూఐసీసీ విభాగం, బ్లాక్ బక్స్ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం హ్యాకథాన్ నిర్వహించారు. ఈ సందర్భంగా రోడ్డు ప్రమాదాల నివారణ, ట్రాఫిక్ సమస్యల పరిష్కార మార్గాలపై విద్యార్థుల నుంచి ప్రణాళికాబద్ధమైన సలహాలు, సూచనలు స్వీకరించారు. దేశ వ్యాప్తంగా 90 కళాశాలలకు చెందిన 589 విద్యార్థి బృందాలకు గానూ 2046 మంది విద్యార్థులు వివిధ రౌండ్ల వారీగా హ్యాకథాన్‌లో పాల్గొని వారి ప్రతిభను చాటారు. అత్యుత్తమ సూచనలకు వీసీ కట్టా నర్సింహారెడ్డి, రిజిస్ట్రార్ మంజూర్ హుస్సేన్, ట్రాఫిక్ డీసీపీ డీవీ శ్రీనివాసరావు, ట్రాన్స్‌పోర్టు కమిషనర్ నిజామాబాద్ కె. వెంకటరమణ బహుమతులు ప్రదానం చేశారు. విద్యార్థులు అందించిన అమూల్యమైన సలహాలు, సూచనలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తామన్నారు. కార్యక్రమంలో యూనివర్సిటీ ఇండస్ట్రీ ఇంటరాక్షన్ సెక్టార్ డైరెక్టర్ ఎస్.తారా కళ్యాణి, డా.సురేష్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వద్దేపల్లి రాజేశ్వరరావు జన్మదిన వేడుకలు



బీజేపీ నాయకులు, అభిమానుల మధ్య కేక్ కట్ చేస్తున్న వద్దేపల్లి రాజేశ్వరరావు

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి బీజేపీ సీనియర్ నాయకుడు వద్దేపల్లి రాజేశ్వరరావు జన్మదిన వేడుకలు బుధవారం ఎన్‌కేఎన్ఆర్ గార్డెన్‌లో ఘనంగా నిర్వహించారు. వివేకానందనగర్‌లోని ఆయన నివాసం నుంచి భారీ బైక్ ర్యాలీగా నిర్వహించారు. కార్యకర్తలు, నాయకులు ఆయనను గజమాలతో ఘనంగా సత్కరించారు. రాజేశ్వరరావుతో కేకులు కట్ చేయించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు మాధవరం కాంతారావు, అద్వానీ సూర్యారావు, నాయినేని సూర్యప్రకాష్‌రావు, నియోజకవర్గ అసెంబ్లీ కన్వీనర్ శ్రీకర్‌రావు, నాయినేని పవన్‌కుమార్, రవికుమార్‌యాదవ్, తూము వేణు, వినోద్ కుమార్‌గౌడ్, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఐదు డివిజన్లకు కాంగ్రెస్ అధ్యక్షుల నియామకం

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి నియోజకవర్గ పరిధిలోని ఐదు డివిజన్లలో కాంగ్రెస్ పార్టీ ప్రెసిడెంట్లు, వర్కింగ్ ప్రెసిడెంట్లుగా మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా అధ్యక్షుడు నందికంటి శ్రీధర్ బుధవారం నియమించారు. కేపీహెచ్‌బీకాలనీ డివిజన్ ప్రెసిడెంట్ టి.ప్రవీణ్‌కుమార్, వర్కింగ్ ప్రెసిడెంట్ డి.రవీంద్ర రెడ్డి, ఫతేనగర్ డివిజన్ ప్రెసిడెంట్‌గా కుక్కల రమేష్ ముదిరాజ్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఎం. రాము, బోయినపల్లి డివిజన్ ప్రెసిడెంట్‌గా కె.మల్లికార్జున్ యాదవ్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా అస్లాం, బాలానగర్ డివిజన్ ప్రెసిడెంట్‌గా రెడ్డివారి మధుగౌడ్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఎం.ప్రసన్నకుమార్, కూకట్‌పల్లి డివిజన్ ప్రెసిడెంట్‌గా మేకల రమేష్, వర్కింగ్ ప్రెసిడెంట్ బి.గోవింద్‌గౌడ్‌లను నియమించినట్లు తెలిపారు.

శేరిలింగంపల్లిలో ఎగిరేది బీజేపీ జెండానే..

బీజేపీ సీనియర్ నాయకుడు గజ్జల యోగానంద్

ఆల్విన్‌కాలనీ: ప్రజాసమస్యలపై చేపట్టిన పాదయాత్రలో ప్రజలతో మమేకమవుతూ.. సమస్యలను తెలుసుకుంటూ వాటిని పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామని శేరిలింగంపల్లి నియోజకవర్గ బీజేపీ సీనియర్ నాయకుడు గజ్జల యోగానంద్ అన్నారు. కూకట్‌పల్లి డివిజన్ పరిధిలోని పాపిరెడ్డినగర్, ఆస్‌బెస్టాస్ కాలనీలో బుధవారం చేపట్టిన పాదయాత్రకు ప్రజలు బ్రహ్మరథం పట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో అధిక పన్నులు చెల్లిస్తున్నటువంటి శేరిలింగంపల్లి నియోజకవర్గంలో రోడ్లు, డ్రైనేజీ, రోడ్లు, అంగన్‌వాడీ సిబ్బందికి సరైన సౌకర్యాలు లేకపోవడం సిగ్గుచేటన్నారు. బస్తీ దవాఖానాలు లేక సంబంధిత వైద్యులు లేక ప్రైవేట్ ఆసుపత్రులకు వెళ్లాల్సిన దుస్థితి నెలకొందన్నారు.

- 10వేలకు పైగా ప్రజలు నివాసం ఉంటున్న ఆస్‌బెస్టాస్ కాలనీలో అన్ని మౌలిక వసతులు ఉన్నప్పటికి, లేఔట్లు వేసిన ఇళ్లకు రెగ్యులరైజేషన్ చేయకపోవటం ప్రభుత్వ అసమర్థతకు నిదర్శనమన్నారు. విద్యుత్ చార్జీలు పలుమార్లు అనవసరంగా పెంచటంతో భరించలేకపోతున్నామని స్థానికులు వాపోతున్నారని అన్నారు. బంగారు తెలంగాణ చేస్తామన్న కేసీఆర్ ప్రజల సొమ్మును తన ఇంటికి మళ్లిస్తున్నారని యోగానంద్ తెలిపారు. నగరానికి దూరంగా ఉండాల్సిన పరిశ్రమలు ప్రజలు నివాసం ఉంటున్న ప్రదేశాల్లో ఉండటంతో ప్రజలు అనారోగ్యాలకు గురవుతున్నారని అన్నారు. ప్రజలు పడుతున్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు భూపాల్ రెడ్డి, డివిజన్ వైస్ ప్రెసిడెంట్ ఇంద్రకుమార్‌రెడ్డి, నాయకులు పర్వతాల యాదవ్, ప్రభాకర్ యాదవ్, గోవర్ధన్‌చారి, రాములు, మురళి తదితరులు పాల్గొన్నారు.



కేంద్ర ప్రభుత్వ పథకాల కరపత్రాన్ని అందజేస్తున్న గజ్జల యోగానంద్

ఎన్ఎస్‌యూఐ నాయకుల అరెస్టు

భాగ్యనగర్‌కాలనీ: ఆకాష్ బైజూస్ కాలేజీలో అక్రమంగా ప్రవేశించి అధ్యాపకుడిపై దాడి చేసిన సంఘటనలో పలువురిపై కేసు నమోదైనట్లు కూకట్‌పల్లి పోలీసులు తెలిపారు. ఎస్సై శంకర్ తెలిపిన వివరాల ప్రకారం... కూకట్‌పల్లిలోని ప్రభుత్వ కళాశాల పక్కన ఉన్న ఎఫ్ఎస్‌బీ ఆకాష్ బైజూస్ కళాశాలలో తరగతులు కొనసాగుతున్నాయి. విషయం తెలుసుకున్న ఎన్ఎస్‌యూఐ నాయకులు అజయ్‌కుమార్, నాగేంద్రబాబు, అంబటి వంశీవర్ధన్, నిఖిల్‌లు అక్కడికి చేరుకొని ఇంటర్‌మీడియట్ తరగతులు ఎలా నడిపిస్తున్నారని ప్రశ్నించారు. తరగతులు నిలిపేయాలని కళాశాల యాజమాన్యాన్ని కోరారు. ఈ క్రమంలో ఇరువురి మధ్య వాగ్వావాదం చోటు చేసుకోవటంతో సిబ్బందిపై దాడికి పాల్పడ్డారు. కళాశాల నిర్వాహకులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎన్ఎస్‌యూఐ నాయకులపై పోలీసులు కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్లు తెలిపారు.